'అయ్యో... రక్తం!' అంటూ జేబులోంచి రుమాలుతీసి పక్కనే వున్న నీళ్ళల్లో తడిపి- క్షణంలో ఆయనవేలికి కట్టుకట్టాడు చలపతి.

'అవును! ఈ రక్తం పంచుకుపుట్టాడేతప్ప ఆ దిక్కుమాలిన దరిద్రుడు మా ప్రేమను పంచుకుపుట్టలేదు....' అన్నారాయన ఆవేశంగా ఆలా అంటూంటే ఆయన ముఖకవళికలే మారిపోయాయి... కళ్ళల్లోకి రక్తమే పొంగివచ్చింది.

ఆపక్కనే భగవద్గీత చదువుకుంటున్న రాఘవరావు పరిస్థితిని గమనించి చలపతిని నెమ్మదిగా బయటకు తీసుకెళ్లాడు.

మా గోపాలం దగ్గర అతని కొడుకు సంగతి మాట్లాడకూడదు.... తెలుసా?' అడిగాడు.

'ఎందుకనీ?'

'కొడుకంటే అతనికి ద్వేషం!.... తన ప్రాణంలో ప్రాణంగా ప్రేమించిన భార్యను చంపి మరీ పుట్టాడని కోపం!.. ఆమె కోసం గోపాలం తనవాళ్ళనందర్నీ వదులుకున్నాడు. చివరకు ఆమెకూడా దూరమయ్యేసరికి- జీవితం మీదే అతనికి విరక్తికలిగింది... అందుకే ఆపసిబిడ్డను ఎక్కడో అనాధాశ్రమంలో ఇచ్చేసి తాను ఇలా కాశీవచ్చి స్థిరపడ్డాడు... నాతో పరిచయమైన తొలిరోజుల్లో ఓసారి ఈవిషయాలన్నీ చెప్పాడు!'— వివరించాడు రాఘవరావు.

ఆతర్వాత మరి, గోపాలందగ్గర ఆయన కొడుకు ప్రస్తావన తీసుకురాలేదు చలపతి....

అతను తిరిగి తన ఊరు ప్రయాణమైన రోజున- తమతో భోజనం చేయమని చలపతిని ఆహ్వానించారు గోపాలంగారు. ప్రత్యేకించి పాయసం కూడా తయారుచేశారు.

'ఈపదిరోజులూ నువ్వు మాతోవుండి... మాకెంతో సన్నిహితుడివయ్యావ్.... ఇవాళనువ్వు వెళ్ళిపోతూంటే నాకు బెంగగా వుందయ్యా?' అన్నారాయన భోజనం చేస్తూ.

అప్రయత్నంగా చలపతి కళ్ళల్లో కన్నీరు నిలిచింది.

'మిమ్మల్ని వదలివెళ్ళాలంటే నాకూ బాధగానేవుంది బాబుగారూ! తరచుగా ఉత్తరాలు రాస్తాను.... వీలైతే మీయోగక్షేమాలు తెలియచేస్తూ వుండండి!'— అన్నాడు బరువుగా.

అలా గోపాలంగారి దగ్గర- అప్పుడు వీడ్కోలు తీసుకుని, తిరిగివచ్చేసిన చలపతి- మళ్ళీ నాలుగేళ్ళ తర్వాత- ఇప్పుడు మరోసారి కాశీ బయల్దేరాడు.

గంగలో మునిగి పుణ్యం మూటకట్టుకోవాలనో, విశ్వేశ్వరున్ని సందర్శించుకుని సంతృప్తి పడాలనోకాదు!

కేవలం గోపాలంగారి కోసమే- ఆయన్ని చూడాలన్న ఆకాంక్షతోనే బయల్దేరాడు.

అందుకే వారణాశి స్టేషన్లో రైలుదిగిన చలపతి- క్షణం ఆలస్యం చేయకుండా టాంగా ఎక్కి హరిశ్చంద్ర ఘాట్ చేరుకున్నాడు.

అక్కడి సత్రంలో- గోపాలంగారుండే గదిపైపునడిచాడు.

ఆ కాసేపూ మాట్లాడటంవల్ల ఆయనకు ఆయాసం ఎక్కువైంది

'నేను వెళ్ళి డాక్టర్ని తీసుకురానా ?'— అడిగాడు చలపతి ఆయన పరిస్థితిని గమనించి.

వద్దని వారిస్తున్నట్టుగా తల అడ్డంగా తిప్పారాయన.

'లాభంలేదుబాబూ! ఇంక మందుల్తో నా ప్రాణాలు నిలబడవ్... నాకు తెలుసు! చావంటే నాకు భయంలేదు.... కానీ నాబాధల్లా ఒక్కటే! మాలో ఎవరు ముందుపోతే, వారికి రెండోవాళ్ళు తలకొరివి పెట్టాలని ఆ రాఘవుడూ నేనూ అనుకున్నామా ?... ఆ ఒప్పందాన్ని గాలికి వదిలేసి వాడిదారిన వాడు వెళ్ళిపోయాడు. అయినాపరవాలేదులే!.... వీధినపోయే సాదువులెవరో ఆమాత్రం పుణ్యం కట్టుకోకపోరు! ఈ అనాధ శవాన్ని ఎలాగో అలా ఆ గంగలోకి ఈడ్చేస్తారు!'

ఆయన మాటలువింటున్న చలపతికి ఆవేదనకలిగింది...

'బాబుగారూ !... మీకంటే చిన్నవాణ్ణి... అయినా ఒక్క విషయం చెప్పాలనివుంది....' చెప్పమన్నట్టు కళ్ళతోనే సంజ్ఞ చేశారు గోపాలంగారు.

'మీ అబ్బాయిని ఎక్కడో అనాధాశ్రమంలో ఇచ్చేశారని, ఆ మధ్య రాఘవరావ్‌గారు చెప్పారు.... మీకు అభ్యంతరం లేకపోతే అతను.... అతను ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసుకుని...' నెమ్మదిగా అన్నాడు చలపతి....

ఆయన మాట్లాడలేదు.... దీనంగా అతని వైపుచూశారాయన. ఎక్కడో గుండెపొరలమధ్య నిలిచిపోయిన ఒకటి రెండు కన్నీటి చుక్కలు ఆయన కళ్ళల్లోకి చేరుకున్నాయి.

